ప్రజాశక్తి
మంగళవారం 2 సెప్టెంబర్ 2025
5
పార్వతీపురం మన్యం

రక్తహీనతను నివారించాలి : కలెక్టర్

పార్వతీపురం : జిల్లాలో రక్తహీనత సమస్య ఉందని, ఐరన్ ఫోలిక్ యాసిడ్ మాత్రలను తీసుకోవడం ద్వారా దాన్ని పూర్తిగా నివారించవచ్చని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ మహిళలకు పిలుపునిచ్చారు. అనిమియా ముక్త్ భారత్ కార్యక్రమంలో భాగంగా రక్తహీనత నివారణ కోసం మహిళలకు ఐరన్ ఫోలిక్ యాసిడ్ మాత్రల పంపిణీ కార్యక్రమం కలెక్టర్ ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ ఆర్.వైశాలి, డిఆర్ఒ కె.హేమలత, ఇతర జిల్లా అధికారులు, కలెక్టరేట్ మహిళా సిబ్బందికి ఐరన్ ఫోలిక్ యాసిడ్ మాత్రలను కలెక్టర్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముందుగా కలెక్టర్ కార్యాలయంలోని మహిళలతో ప్రారంభించామని, మంగళ వారం నుంచి జిల్లాలోని ప్రతి మహిళకు వైద్య, ఆరోగ్య శాఖ సిబ్బంది మాత్రలను అందించడం జరుగుతుందని స్పష్టం చేశారు. జిల్లాలో అనిమియా సమస్య ఎక్కువగా ఉన్నందున, వీటిని తప్పక తీసుకుని నివారణకు సహకరించాలని కలెక్టర్ కోరారు.

మెగా డిఎస్‌సి నుంచి ఏజెన్సీ పోస్టులు మినహాయించాలి

ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా సహాయ కార్యదర్శి రామస్వామి డిమాండ్ కలెక్టరేట్ వద్ద నిరసన

ప్రజాశక్తి - పార్వతీపురం

మెగా డీఎస్సీ నుంచి ఏజెన్సీ ఉపాధ్యాయ పోస్టులు మినహాయించి, గిరిజనులకు వంద శాతం ఉపాధి కల్పించాలని ఎపి ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కె.రామస్వామి డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక ఆర్‌టిసి కాంప్లెక్స్ నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించి అక్కడ నిరసన తెలిపారు. అనంతరం కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాదుకు వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా రామస్వామి మాట్లాడుతూ రెండు నెలల క్రితం రాష్ట్ర ప్రభుత్వం మెగా డీఎస్సీ టీచర్ పోస్టులు విడుదల చేసే పరీక్షలు కూడా నిర్వహించిందని కానీ చంద్రబాబు ప్రభుత్వం ఎన్నికల సభలో అధికారంలోకి వచ్చిన వెంటనే జిఒ 3 తరహా సమాంతర చట్టాన్ని తీసుకొచ్చి నూటికి నూరు శాతం ఉద్యోగాలు ఏజెన్సీ నిరుద్యోగులకు కల్పిస్తామని హామీ ఇచ్చారని, నేడు దాన్ని పూర్తిగా విస్మరించారని తెలిపారు. వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కొల్లి గంగునాయుడు కార్యక్రమానికి సంఘీభావం తెలుపుతూ రాష్ట్ర ప్రభుత్వం గిరిజనులకు తీరని ద్రోహం చేస్తుందని విమర్శించారు. ప్రతిపక్షంలో గిరిజనుల కోసమే కూటమి ప్రభుత్వాన్ని నమ్మించి, అధికారంలోకి వచ్చి రెండేళ్లు కావస్తున్న నేటికీ గిరిజనులకు ఇచ్చిన మాట ప్రకారం జీవో 3ను పునరుద్దరించడం గాని, గిరిజన స్పెషల్ డిఎస్సీ ప్రకారం ఉద్యోగాలను కల్పించడం గాని చేయని తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం చిత్తశుద్ధితో గిరిజనులకు ఇచ్చిన హామీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కె.సీతారాం, నాయకులు పి.రాము, బి.రాము, గౌరయ్య, వరాలు, సిఐటియు జిల్లా కోశాధికారి జి.వెంకటరమణ, పట్టణ నాయకులు బి.సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

పార్వతీపురం పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న గిరిజనులు

గుమ్మలక్ష్మీపురం : జిఒ 3 స్థానంలో ప్రత్యామ్నాయంగా ఏజెన్సీలో 100 శాతం ఉద్యోగ ఉపాధ్యాయ నియమకాల్లో చట్టం చేసి గిరిజన నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని గుమ్మలక్ష్మీపురంలో గిరిజనులు నిరసన, ర్యాలీ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కోశాధికారి మండంగి రమణ మాట్లాడుతూ జిఒ3ను సుప్రీంకోర్టు రద్దు చేయడంతో ఏజెన్సీలో హక్కుగా పొందే అవకాశం లేకుండా పోయిందన్నారు. ఏజెన్సీ ప్రాంతంలో కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ పేరుతో వందలాది పోస్టులు ఆదివాసీ యేతరులు పొందుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివాసీలకు స్పెషల్ డిఎస్‌సి విడుదల చేయకుండా ప్రభుత్వం అన్యాయం చేసిందని తెలిపారు. దీనివల్ల గిరిజన ప్రాంతాల్లో నిరుద్యోగం పెరిగి వలసబాట పడుతున్నారని, గిరిజన ప్రాంతాల్లో అక్షరాస్యత మరింత తగ్గిపోతోందని అన్నారు. ఏదైతే ఎన్నికలకు ముందు ప్రభుత్వం వాగ్దానం చేసిందో దాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు బి. అనిల్, నాయకులు ఎ.గంగారావు, యువజన సంఘం సభ్యులు, గిరిజన సంఘం నాయకులు పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురంలో నిరసన తెలుపుతున్న గిరిజన సంఘాల నాయకులు,

కొమరాడ : జిఒ3ను పునరుద్దరించి ఏజెన్సీలో ప్రత్యేక డిఎస్‌సి ద్వారా గిరిజన నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వి. ఇందిరా డిమాండ్ చేశారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజ్ సెంటర్ వద్ద ఎపి గిరిజన సంఘం ఆధ్వర్యంలో జీవో 3ను అమలు చేయాలని, గిరిజన ప్రాంతాల్లో 100శాతం ఉద్యోగాలు గిరిజనులకే ఇవ్వాలని నిరసన, ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి గిరిజన సంఘం నాయకులు రాజారావు, వి.ఇందిర మాట్లాడారు. గిరిజన యువతను ఆదుకొనేలా జిఒ3ను పగడ్బందీగా అమలు చేయాలని, గిరిజన ప్రాంతాల్లో 100శాతం ఉద్యోగాలు గిరిజన యువతీ యువకులకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు కొల్లి సాంబమూర్తి, వ్యవసాయ, గిరిజన సంఘాల నాయకులు రెడ్డి శివున్నాయుడు, యువత పాల్గొన్నారు.

మన్యంలో భారీ వర్షాలు

ప్రజాశక్తి - కురుపాం

వాయువ్య బంగాళాఖాతంలో ఏర్పడ్డ ఉపరితల ఆవర్తన ప్రభావంతో సోమవారం సాయంత్రం జిల్లాలోని పార్వతీపురం, కురుపాం, మక్కువ, వీరఘట్టం తదితర మండలాల్లో భారీ వర్షాలు కురిశాయి. కురుపాంతో పాటు పరిసర గ్రామాల్లో ఉరుములు, మెరుపులతో ఏకధాటిగా గంటపాటు భారీ వర్షం కురిసింది. ఈ వర్షం వరినాట్లుకు, ఆరుతడి పంటలకు ఎంతగానో వర్షం ఉపయోగపడుతుందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

మక్కువ: ఇటీవల కురిసిన వర్షాలకు అన్నదాతల మెట్ట పంటలకు ఒకింత నష్టం వాటిల్లినప్పటికీ, తెరిపిచ్చి మూడు రోజులు కూడా కాకముందే మళ్లీ సోమవారం మధ్యాహ్నం నుంచి ముసురుకోవడంతో అన్నదాతలు ఆందోళన గురి చెందుతున్నారు. మెట్ట పంటలైన పత్తి, మొక్కజొన్నకు ఈ వర్షాల వల్ల తెగుళ్ల సోకే అవకాశం ఉందని, అలాగే వరి పైరు కూడా పురుగు, దోమ ఆశించే ఆస్కారం ఉందని పలువురు రైతులు ఆవేదన చెందుతున్నారు. మరోవైపు వర్షాధారంపై వేసే పంటలకు ఈ ముసరు ఒకింత మేలు చేకూరుస్తుందని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఇదిలా ఉండగా వినాయక విగ్రహాలు అనుపోత్సవానికి ముందే తడిసి మొద్దవడంతో భక్తులు కలవర చెందుతున్నారు. వర్షాకాలం అయినప్పటికీ ఇటీవల కురుస్తున్న వాన వల్ల అన్ని రకాల ప్రజలు ఇబ్బందులు గురవుతున్నారు.

వీరఘట్టం : మండలంలోని సోమవారం కుండపోత వర్షం కురిసింది. గత మూడు రోజులుగా ఎండ తీవ్రత అధికంగా ఉండుటవల్ల ప్రజలు ఎండ వేడిమి తట్టుకోలేక ఉక్కపోతతో అల్లాడిపోతున్న తరుణంలో భారీ వర్షం పడింది. ఈ వర్ష ప్రభావం క్యాబేజీ పంటపై పడనుంది.

వట్టిగెడ్డలో కొట్టుకుపోయిన రైతు

ప్రజాశక్తి - పాచిపెంట

సాలూరు మండలం నెలిపర్తి పంచాయతీ, దుగ్గ సాగరం మాజీ సర్పంచి, రైతు మంచాల రామారావు(48) సోమవారం వట్టిగెడ్డలో కొట్టుకు పోయారు. స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. రామరావు సోమవారం వట్టిగెడ్డ దాటి తన పొలానికి వెళ్లాడు. తిరిగి సాయంత్రం వస్తుండగా, మళ్లీ వట్టిగెడ్డ నదిని దాటుతుండగా, ఎగువన కురిసిన వర్షాలకు గెడ్డ ఉధృతంగా ఎక్కువగా రావడంతో ఆయన వరద ధాటికి కొట్టుకొని వెళ్లిపోయాడు. గెడ్డకు అవతల ఒడ్డున ఉన్న అదే గ్రామస్తుడు చూసి ఆయన్ను రక్షించేందుకు ప్రయత్నించినా ప్రయోజనం లేకపోయింది. దీంతో వెంటనే గ్రామానికి వెళ్లి జరిగిన విషయాన్ని గ్రామస్తులకు తెలిపారు. వీరంతా రామారావు ఆచూకీ కోసం గాలిస్తున్నారు.

గల్లంతైన రైతు రామారావు

పత్తాలేని పిఎఒ, పిహెచ్ఒ

ఎప్పుడు చూసినా ఖాళీ కుర్చీలే దర్శనం

ప్రజాశక్తి - పార్వతీపురం

ఐటిడిఎ పరిధిలో వ్యవసాయం, ఉద్యానవన విభాగాల్లో పనిచేస్తున్న ప్రాజెక్టు వ్యవసాయ అధికారి, ప్రాజెక్టు ఉద్యానవన అధికారులు ఎప్పుడు చూసినా కార్యాలయంలో కనిపించడం లేదు. అలాగని ఏజెన్సీ ప్రాంతంలో గిరిజనులు పంటల సాగును పరిశీలిస్తున్న పరిస్థితీ లేదు. ఎనిమిది గిరిజన మండలాల్లో గిరిజన రైతులు సాగు చేస్తున్న పంటల గురించి వారికి తగిన జాగ్రత్తలపై అవగాహన కల్పించాలి. ఏజెన్సీ ప్రాంతంలో ఇప్పటికే రైతులు వరి, మొక్కజొన్న, పత్తి పంటలు సాగు చేస్తున్నారు. వీటితో పాటు రకరకాల కూరగాయలు కూడా పండిస్తున్నారు. ప్రాజెక్టు వ్యవసాయ, ఉద్యానవన అధికారులు ఐటిడిఎ పిఒ పర్యవేక్షణలో పని చేయాల్సి ఉంటుంది. గత కొంతకాలంగా రెగ్యులర్ పిఒ లేకపోవడంతో వ్యవసాయ, ఉద్యానవన అధికారులు ఎప్పుడు కార్యాలయంలో ఉంటారో, ఎప్పుడు బయటకు వెళ్తారో తెలియని పరిస్థితి నెలకొంది. దీంతో గిరిజన రైతులకు వీరి ఆచూకీ దొరకకపోవడంతో తీవ్ర నిరాశకు గురవుతున్నారు. ఎప్పుడు కార్యాలయానికి వెళ్ళినా అందుబాటులో ఉండడం లేదని వారు ఆవేదన చెందుతు న్నారు. తమకు సేవలందించని అధికారుల స్థానంలో కొత్త వారిని నియమించాలని గిరిజన రైతులు కోరుతున్నారు.


అధికారులు లేక ఖాళీగా ఉన్న కుర్చీలు

అందుబాటులో 777 టన్నుల యూరియా

ప్రజాశక్తి - పార్వతీపురం

జిల్లాలో సుమారు 777 టన్నుల యూరియా రైతు సేవా కేంద్రాల వద్ద అందుబాటులో ఉందని జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ స్పష్టం చేశారు. ఈ మేరకు సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లాకు సోమవారం 250 టన్నుల స్పిక్ కంపెనీ యూరియా మార్కెఫెడ్‌కు సరఫరా చేసినట్లు చెప్పారు. మార్కెఫెడ్ బఫర్ నుంచి గడచిన రెండు రోజుల్లో 256 టన్నుల యూరియాను జిల్లాలోని 21 రైతు సేవా కేంద్రాలకు తరలించినట్లు పేర్కొన్నారు.

ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలి : కలెక్టర్

ప్రజాశక్తి - పార్వతీపురం

ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన సమస్యలపై అధికారులు తక్షణమే స్పందించాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో పిజిఆర్ఎస్ కార్యక్రమం కలెక్టర్ అధ్యక్షతన సోమవారం జరిగింది. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ ఆర్.వైశాలి, డిఆర్ఒ కె.హేమలత, ఎస్డీసీ పి.ధర్మచంద్రారెడ్డి, డిఆర్‌డిఎ పీడీ ఎం.సుధారాణితో కలిసి అర్జీదారుల నుంచి వినతులను స్వీకరించారు. జిల్లాలోని పలు ప్రాంతాలకు చెందిన అర్జీదారుల నుంచి వినతులను స్వీకరించిన కలెక్టర్, ప్రతి సమస్యను సావదానంగా విని, వాటికి తగిన పరిష్కారం చూపాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. అధికారులు ఎప్పటికపుడు అర్జీలను గమనించి, పరిష్కారానికి చర్యలు తీసుకోవడం ద్వారా అర్జీలు పెండింగ్ ఉండబోవని హితవు పలికారు. 73 వినతులు అందాయి. కార్యక్రమంలో అన్ని శాఖల జిల్లా ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

పార్వతీపురం టౌన్: బాధితులు ఇచ్చిన ప్రతి ఫిర్యాదుకు తక్షణ పరిష్కారం కోసం చర్యలు చేపడుతున్నట్లు ఎస్పీ ఎస్‌వి మాధవరెడ్డి తెలిపారు. సోమవారం స్థానిక జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ఫిర్యాదుదారుల నుంచి అర్జీలను స్వీకరించి, అర్జీదారులతో ముఖాముఖి మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకొని, వారి ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించారు. ఫిర్యాదు అంశాలను పరిశీలించి, వాటి పూర్వాపరాలను విచారణ చేసి, ఫిర్యాదు అంశాల్లో వాస్తవాలు ఉన్నట్లయితే చట్ట పరిధిలో తక్షణ చర్యలు చేపట్టాలని, తీసుకున్న చర్యలకు సంబంధించిన నివేదికను జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయానికి పంపాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో 7 ఫిర్యాదులు అందాయి. కార్యక్రమంలో డిసిఆర్‌బి సిఐ ఆదాం, సిబ్బంది పాల్గొన్నారు.

హెల్పర్లకు ప్రమోషన్లు ఇవ్వాలి

ఎపి అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ డిమాండ్ కలెక్టరేట్ వద్ద రిలే నిరాహార దీక్షలు ప్రారంభం

ప్రజాశక్తి - పార్వతీపురం

అర్హత కలిగిన హెల్పర్లకు జీవో 2 ప్రకారం వర్కర్లుగా ప్రమోషన్ చేయాలని ఎపి అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు సోమవారం స్థానిక కలక్టరేట్ ఎదుట ఎపి అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. మొదటగా జిల్లా ప్రధాన కార్యదర్శి గంట జ్యోతిలక్ష్మి పూలమాలలు వేసి దీక్షలను ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా గౌరవ అధ్యక్షులు ఎం.ఉమామహేశ్వరి మాట్లాడుతూ జిఒ 2 ప్రకారం హెల్పర్లకు ప్రమోషన్లు ఇవ్వాలని, ప్రత్యేక జీవో ఉన్నప్పటికీ జిల్లా అధికారులు జాప్యం చేస్తున్నారని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా జిఒ అమలవుతుందని, జిల్లాలో మాత్రం కుట్ర పూరితంగా వ్యవహరిస్తున్నారని అన్నారు. పలుమార్లు ఐసిడిఎస్ పిఒకు, పీడీలకు, కలెక్టరుకు కలిసినప్పటికీ ఫలితం లేకపోలేదని, అందుకే రిలేదీక్షలు చేపడుతున్నామని తెలిపారు. ఇప్పటికైనా అధికారులు చిత్తశుద్ధితో స్పందించి అర్హత కలిగిన హెల్పర్లకు జిఒ 2 ప్రకారం వర్కర్లుగా ప్రమోషన్ ఇవ్వాలని లేకుంటే ఈ దీక్షలు ఈనెల 7వరకు కొనసాగించి, 8న కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వై.మన్మధరావు, కోశాధికారి జి.వెంకటరమణ, నాయకులు బి.సూరిబాబు, యూనియన్ జిల్లా నాయకులు గౌరీమణి, సత్యవతి, రాజేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ వద్ద రిలే నిరాహారదీక్ష చేస్తున్న అంగన్‌వాడీలు

బలహీన వర్గాల సంక్షేమమే లక్ష్యం : మంత్రి

ప్రజాశక్తి - సాలూరు

బలహీన వర్గాల సంక్షేమమే కూటమి ప్రభుత్వం లక్ష్యమని రాష్ట్ర గిరిజన సంక్షేమ, స్త్రీ, శిశు సంక్షేమ శాఖా మంత్రి గుమ్మిడి సంధ్యారాణి అన్నారు. సోమవారం సాలూరు పట్టణంలో మున్సిపాలిటీ పరిధిలోని గుమడం 3వ వార్డులో మంత్రి పెన్షన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికీ పెన్షన్ చేరేలా అధికారులు కృషి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు.

సాలూరులో పింఛన్లు పంపిణీ చేస్తున్న మంత్రి సంధ్యారాణి

సీతానగరం : మండలంలోని బూర్జలో పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ పాల్గొన్నారు. లబ్ధిదారుల ఇంటింటికీ కలెక్టర్ వెళ్లి పింఛన్లు అందించారు. పింఛన్ల పంపిణీ అనంతరం ప్రజల స్పందనను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో డిఆర్‌డిఎ పీడీ ఎం.సుధారాణి, తహశీల్దార్, ఎంపిడిఒ, సంక్షేమ సహాయకులు తదితరులు పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురం : మండలంలోని లోవ ముఠా ప్రాంతంలోని బాలేసు, గాంద్ర గ్రామాల్లో ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి పింఛన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు అడ్డాకుల నరేష్, మాజీ కన్వీనర్ పాడి సుదర్శన్‌రావు, మాజీ ఎంపిపి తాడంగి లక్ష్మణరావు, కొత్తవలస మాజీ సర్పంచ్ కద్రక కృష్ణారావు, సర్పంచ్ ధర్మారావు, నాయకులు రంజిత్ కుమార్, దాసు, పురుషోత్తం, బలరాం, సీతారాం, వెంకటరావు, చంద్రశేఖర్, సోమరావు, రమేష్, శరత్, అనీష్, సచివాలయ సిబ్బంది, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పార్వతీపురం టౌన్: పట్టణంలోని 19వ వార్డులో ఎమ్మెల్యే బోనెల విజయ్‌చంద్ర సోమవారం పింఛన్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలి

ప్రజాశక్తి - బలిజిపేట

ఎన్నికల మేనిఫెస్టోలు ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించి, సంక్షేమ పథకాలు అమలు చేయాలని, నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని అందించిన భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు సోమవారం స్థానిక తహశీల్దార్ బాలమురళీకృష్ణకు వినతిని అందజేశారు. ఈ సందర్భంగా సంఘం మండల కార్యదర్శి చక్రధర్, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వై.మన్మధరావు మాట్లాడుతూ జిల్లాలో 15వేల మంది, మండలంలో వెయ్యి మంది ఈ రంగంపై ఆధారపడి జీవిస్తున్నారన్నారు. సంక్షేమ బోర్డు ద్వారా అనేక ఏళ్లుగా అమలవుతున్న సంక్షేమ పథకాలను ఆపేస్తూ వైసిపి ప్రభుత్వం 1214 మెమో జారీ చేసిందని విమర్శించారు. ఫలితంగా లక్షలాది మంది భవన నిర్మాణ కార్మికులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారని ఆందోళన వ్యక్తం చేశారు. ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు పునరుద్ధరించి, సంక్షేమ పథకాల అమలు చేయిస్తామని హామీ ఇచ్చారని అన్నారు. ఆ హామీ మేరకు కార్మికులను సమస్యలు పట్టించుకోలేదని ఆందోళన వ్యక్తం చేశారు. సంక్షేమ బోర్డు పునరుద్ధరించి పెండింగ్ క్లైములు పరిష్కరించాలని కోరారు. 1234 మెమో రద్దు చేసి సంక్షేమ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికుల పిల్లలకు స్కాలర్‌షిప్‌లు ఇవ్వాలని, పెన్షన్ సౌకర్యం కల్పించాలి అన్నారు. కార్యక్రమంలో గౌరి నాయుడు, తవిటయ్య, చంటి, ఈశ్వరరావు, జయరావు, శ్రీను పాల్గొన్నారు.

సాలూరు : వినతిని అందజేస్తున్న భవన నిర్మాణ కార్మికులు

సాలూరు : భవన నిర్మాణ రంగంలో ఉన్న కార్మికులందరి సమస్యలు పరిష్కారం చేయాలని ఎపిభవన నిర్మాణ కార్మికుల సంఘం గౌరవాధ్యక్షులు ఎన్ వై నాయుడు, సాలూరు కమిటీ నాయకులు రౌతు చిన్నయ్య, ఎస్ మోహన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు తహశీల్దార్‌కు వినతిని అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ వివిధ సందర్భాల్లో వసూలు చేసిన సెస్ నిధులను సంక్షేమ బోర్డు ద్వారా నిర్మాణ కార్మికులకే ఖర్చు చేయాలని, ఇదివరకు వెల్ఫేర్ బోర్డు నుండి తీసుకున్న నిధులు వెంటనే తిరిగి ఇవ్వాలని, డిమాండ్ చేశారు. కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు రాజు, శ్రీను, సత్యనారాయణ, నూకారావు, జగదీష్, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

పార్వతీపురం టౌన్ : భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించి, కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సిఐటియు ఆధ్వర్యంలో స్థానిక తహశీల్దార్ కార్యాలయంలోని హెచ్‌డిటి రక్త కుమార్‌కి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో భవన కార్మిక సంఘం మండల నాయకులు డి.రాంబాబు, కె.దుర్గారావు, వెంకటరమణ, కె.త్రినాధ రావు, లక్ష్మణరావు, తారక, బి లక్ష్మణ, రాపాక శ్రీను, కె.శ్రీను, సిఐటియు జిల్లా కోశాధికారి జి.వెంకటరమణ, నాయకులు బంకురు సూరిబాబు తదితరులు పాల్గొన్నారు. భవనం కార్మికులకు సంక్షేమ బోర్డును పునరుద్ధరించి, పథకాలను అమలు చేయాలన్నారు. ఈనెల 8న సుందరయ్య భవనంలో జిల్లా సదస్సు, అనంతరం జిల్లా కలెక్టర్ దృష్టికి సమస్యలు తీసుకువెళ్లి వినతిని అందజేసేందుకు ప్రతి ఒక్కరూ రావాలని పిలుపు నిచ్చారు.

సీతానగరం : వినతిని అందజేస్తున్న భవన నిర్మాణ కార్మికులు

సీతానగరం : భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఆసంఘం జిల్లా కార్యదర్శి రాయిపల్లి రాము డిమాండ్ చేశారు. స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో భవన నిర్మాణ కార్మికుల సమావేశం జరిగింది. అనంతరం తహశీల్దార్ ప్రసన్నకుమార్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా రాము మాట్లాడుతూ 1234 మెమోను రద్దు చేసి అర్హులైన కార్మికులకు గృహ నిర్మాణాలకు వెల్ఫేర్ బోర్డు ద్వారా సబ్సిడీతో కూడిన రుణాలివ్వాలని, వారి పిల్లలకు స్కాలర్షిప్పులు ఇవ్వాలని, వసూలు చేసిన సెస్ నిధులను కార్మికుల సంక్షేమానికి మాత్రమే ఖర్చు పెట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల నాయకులు సనపతి కృష్ణ, తోలాపు రమేష్, ఆర్,శంకరరావు, సారిక గోపి పాల్గొన్నారు.

ఏనుగుల కదలికలపై రాష్ట్ర బృందం పరిశీలన

ప్రజాశక్తి - కొమరాడ

ఒడిశా నుంచి మన్యం జిల్లాలోని 8ఏళ్లుగా తిష్ట వేసిన ఏనుగుల గుంపు కదలికలను పరిశీలిస్తున్నట్లు అటవీ శాఖ ముఖ్య సంరక్షణ అధికారి శాంతిప్రియ పాండే అన్నారు. మండలంలోని గుమ్మడ సమీపంలో ఉన్న ఏనుగుల గుంపును సోమవారం అటవీ శాఖ రాష్ట్ర అధికార బృందం సభ్యులు పరిశీలించారు. ఈ సందర్భంగా బృంద సభ్యులు స్థానికంగా ఉన్న అటవీశాఖ అధికారుల వద్ద ఏనుగుల కదిలిగులపై ఆరా తీశారు. ఏనుగులు ఎక్కువగా ఎటువంటి ప్రాంతాల్లో ఉండడానికి ఇష్టపడుతున్నాయి, ఏ కాలంలో ఎటువైపు ప్రయాణిస్తున్నాయి అన్న వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఏనుగుల వల్ల ఇప్పటి వరకు ఎంత వరకు ప్రాణ, ఆస్తి నష్టాలు జరిగాయన్న వివరాలకు స్థానిక అధికారులు అందజేశారు. ముఖ్యంగా ఏనుగుల కదలికలను ఎప్పటికప్పుడు పరిశీలించి వాటి ఆలోచనలకు ముందస్తుగా అటవీశాఖ అధికారులు గ్రహించి ప్రజలను ఏనుగుల బారిన పడకుండా చూసే బాధ్యత అధికారులపై ఉందని ఈ సందర్భంగా బృంద సభ్యులు తెలిపారు. అనంతరం స్థానికంగా ఉన్న రైతులు తమ పంటపొలాలను ఏనుగులు పూర్తిగా ధ్వంసం చేసి ఆర్థికంగా నష్టపరుస్తున్నాయని అధికారుల వద్ద ఆవేదన వ్యక్తం చేశారు. ఏనుగులను శాశ్వతంగా అటవీ, జూ ప్రాంతాలకు తరలించి తమను ఆదుకోవాలని రైతులు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా అటవీశాఖ అధికారులు తెలిపిన వివరాలు ప్రకారం ఏనుగుల కదలికలపై పరిశీలన చేసి ప్రజలకు, రైతులకు ఇబ్బంది లేకుండా వాటి దిశను మార్చేందుకు చర్యలు చేపడుతున్నట్లు సమాచారం. ఈ కార్యక్రమంలో డిఎఫ్ఒ ప్రసునా, ఇతర అటవీశాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఏ స్థాయి అధికారులు పరిశీలించినా ఫలితం శూన్యం

గత ఎనిమిదేళ్లుగా మన్యంలో తిష్ట వేసిన ఏనుగుల గుంపును తరలించేందుకు ఏ స్థాయి అధికారులు పర్యటించి, పరిశీలించినా ఫలితం శూన్యమని ఈ ప్రాంత రైతుల నుంచి విమర్శలు వినిపిస్తున్నాయి. అధికారులు వచ్చిన ప్రతిసారి రైతులు తమ గోడును వెల్లబుచ్చుకుంటున్నారు తప్ప ఏనుగులను తరలించడం సాధ్యం కావడంలేదు. ఏనుగుల వల్ల పంట నష్టపోయిన రైతులకు పూర్తి స్థాయిలో పరిహారం కూడా ఇవ్వడంలేదు. ఏనుగుల సంచారంపై గతం నుంచి రాష్ట్రస్థాయి అటవీశాఖ అధికారులు పర్యటిస్తున్నప్పటికీ పూర్తిస్థాయిలో ఏనుగుల తరలింపు ఇప్పటి వరకు సాధ్యం కాలేదు. ఇకనైనా ఏనుగులు గుంపు తరలించడం సాధ్యమవుతుందా అన్న ప్రశ్న రైతుల్లో చర్చ జరుగుతోంది.

ఏనుగుల సంచార ప్రాంతాన్ని పరిశీలిస్తున్న అటవీశాఖ ఉన్నతాధికారులు

కుంకీ ఏనుగులు వచ్చే పరిస్థితి ఉందా..?

మన్యం జిల్లాలో ఉన్న ఏనుగుల గుంపును తరలించేందుకు ఇతర రాష్ట్రాల నుంచి కుంకీ ఏనుగులను తెప్పించి వాటికి శిక్షణ ఇస్తున్నట్లు అధికారులు తెలుపుతున్నారు. అయితే ఈ ఏనుగుల శిక్షణ ఎప్పటికి పూర్తవుతుంది ఎప్పుడు తీసుకొచ్చి ఏఈ ప్రాంతం నుంచి తరలిస్తారన్న స్పష్టత అధికారుల్లో లేదు. మరో వైపు సీతానగరం మండలంలో ఏనుగుల సంరక్షణకు పనులు జరుగుతున్నప్పటికీ వీటిని అక్కడికి తరలించేది ఎప్పుడోనన్నది సందిగ్ధంలో ఉంది. ఏళ్ల గడుస్తున్నా ఏనుగుల తరలింపు చర్యలు చేపట్టకపోవడంతో ఈ ప్రాంత రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారు. ముఖ్యంగా వ్యవసాయ పనులు చేయాలంటే ఏ సమయంలో ఏనుగులు వచ్చి దాడి చేస్తాయానన్న భయాందోళనతో బిక్కుబిక్కు మంటూ కాలం వెళ్లదీస్తున్నారు. ప్రతిసారి ఏనుగుల గుంపు కదలికలు పరిశీలించడానికి అధికారులు వచ్చి ఆర్భాటం చేస్తున్నారు తప్ప ఏనుగులు తరలింపునకు కనీస చర్యలు చేపట్టడం లేదని ఈ ప్రాంత రైతులు ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు పర్యటనకు వచ్చిన సందర్భంగా ఈ ప్రాంతం నుంచి ఏనుగులను శాశ్వతంగా తరలించాలని ప్రజలు కోరుతున్నారు.

భామిని: కేంద్ర అటవీ సంరక్షణ అధికారి శాంతి ప్రియ పాండే ఆధ్వర్యంలో కేంద్ర అటవీ బృందం మండలంలోని గణసర, కేసరి, కోసలిలో ఏనుగుల సంచరించిన ప్రదేశాన్ని పరిశీలించింది. ప్రతి ఏటా ఈ ప్రాంతంలో ఏనుగులు ఎందుకు సంచారిస్తున్నాయనే అంశాలను ఆ బృందం పరిశీలించింది. ప్రస్తుతం పార్వతీపురం మండలంలో ఏనుగులు సంచారం ఉందన్న అంశాలు క్షేత్ర స్థాయిలో తెలుసుకొని, ఇచ్చిన నివేదిక ఆధారంగా భవిష్యత్తులో ఏనుగుల తరలింపు అంశాలను పరిశీలిస్తామని తెలిపారు.

నిబంధనలు తప్పక పాటించాలి

పార్వతీపురం: పవిత్రత, భక్తి భావంతో పండుగలను జరుపుకోవాలని, ఆ సమయంలో ప్రభుత్వ నిబంధనలను కచ్చితంగా పాటించాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్, ఎస్‌పి ఎస్‌వి మాధవరెడ్డి స్పష్టం చేశారు. సోమవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో మత సామరస్యంపై కలెక్టర్ ఎస్పీతో కలిసి మత పెద్దలతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్, ఎస్పీ మాట్లాడుతూ వివిధ రకాల సంస్కృతులు, సంప్రదాయాలకు నెలవు మన్యం జిల్లా అని, ఇక్కడ అన్ని రకాల మతాలు సామరస్యంగా ఉండడం విశేషమని కొనియాడారు. వస్తుతః పండుగల వేళ ప్రారంభమైన గణేష్ చతుర్థి, దసరా, క్రిస్మస్, రంజాన్, గ్రామ దేవతల ఉత్సవాలు, ఊరేగింపులు, నిమజ్జన కార్యక్రమాలు ఉంటాయన్నారు. ఇటువంటి సమయాల్లో డీజేలు, అశ్లీల నృత్యాలు నిషేధమన్నారు. శబ్ద కాలుష్యం లేకుండా మైకు సెట్లు ఏర్పాటు చేసుకోవచ్చని, పవిత్రతను దెబ్బతీసేలా ప్రవర్తన ఉండరాదని హితవు పలికారు. ఒకరి మతాన్ని మరొకరు గౌరవించుకుంటూ, సోదరభావంతో పండుగలు జరుపుకోవాలన్నారు. ముఖ్యంగా గణేష్ నిమజ్జన సమయంలో గొడవలు, కొట్లాటలు వంటివి జరగకుండా పెద్దలు యువతకు అవగాహన కల్పించాలని తెలిపారు. నిమజ్జన సమయంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. ఈనెల 9లోగా నిమజ్జన కార్యక్రమాలు పూర్తికావాలని తెలిపారు. సమావేశంలో ఎఎస్పీ అంకిత సురానా, వివిధ మతాలకు చెందిన పెద్దలు, తహశీల్దార్ సురేష్, పోలీస్ అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

క్రీడా ప్రతిభ అవార్డుకు కొత్తగూడ పాఠశాల ఎంపిక

గుమ్మలక్ష్మీపురం : మండలంలోని కొత్తగూడ గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ ఉన్నత పాఠశాల వరుసగా 2023, 2024, 2025 మూడేళ్ల క్రీడా ప్రతిభ అవార్డుకు ఎంపికైంది. మన్యం జిల్లా పాఠశాల స్పోర్ట్స్ ఎక్సలెన్సీ 4 స్థానం, 5వ స్థానం సాధించింది. ప్రతిభ అవార్డు రావడం పట్ల క్రీడాకారులకు హెచ్ఎం బి.శ్రీనివాసరావు, పీడీ మాధవరావు అభినందనలు తెలిపారు.

హెవీ మోటార్ వెహికల్ డ్రైవింగ్‌లో శిక్షణ

పార్వతీపురంటౌన్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థకు చెందిన 'హెవీ మోటార్ వెహికల్ డ్రైవింగ్ పాఠశాల'లో హెవీ మోటార్ వెహికల్ (హెచ్.ఎం.వి) డ్రైవింగ్ శిక్షణకు జిల్లా లోని షెడ్యూల్డు కులాలకు చెందిన నిరుద్యోగ మహిళలు ఈనెల 5లోగా దరఖాస్తు చేసుకోవాలని ఎస్‌సి సొసైటీ ఇఒ డి.వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఆసక్తి గల మహిళా అభ్యర్థులు పూర్తి చేసిన దరఖాస్తును కనీసం ఒక ఏడాది కాలపరిమితి గల లైట్ మోటార్ వెహికల్ డ్రైవింగ్ లైసెన్స్ (ఎల్.ఎం.వి.), 'హెవీ మోటార్ వెహికల్ డ్రైవింగ్ లెర్నర్స్ లైసెన్సు రిజిస్ట్రేషన్ (ఎల్.ఎల్.ఆర్.) పత్రాలను జత చేసి కార్యనిర్వాహక సంచాలకులు, జిల్లా షెడ్యూల్డు కులాల సేవా సహకార సంస్థ, డా.మర్రిచెన్నారెడ్డి భవనం, కంటోన్మెంట్, విజయనగరం – 535 003 వారి కార్యాలయానికి ఈ నెల 5వ తేదీలోగా సమర్పించాలని కోరారు. ఇతర వివరాలకు 90300 14742, 96424 60838, 96526 00967 నెంబర్లను సంప్రదించవచ్చని అన్నారు.

పిహెచ్‌సిని సందర్శించిన డిప్యూటీ డిఎంహెచ్ఒ

సీతానగరం: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని డిప్యూటీ డిఎంహెచ్ఒ పద్మావతి సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రికార్డులను ఎప్పటికప్పుడు అప్ డేట్‌లో ఉంచాలన్నారు. ఎంసిపి కార్డులను పరిశీలించారు. అలాగే ల్యాబ్‌ను పరిశీలించారు. అన్ని ఇన్వెస్టిగేషన్లు ఎప్పటికప్పుడే పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి పి.ఉషారాణి, సిహెచ్ఒ ఎస్‌వి రమణ, యుడిసి మూర్తి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

చలివేంద్రిలో వైద్య శిబిరం

వీరఘట్టం : మండలంలోని చలివేంద్రిలో సోమవారం స్థానిక వైద్యాధికారి బి.ప్రదీప్‌కుమార్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా జ్వరపీడితులు, గర్భిణులు, మధుమేహ, రక్తపోటు, బాలింతలు, చిన్నారులకు ప్రత్యేక వైద్య తనిఖీలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పి, ఎఎన్ఎం, 104 సిబ్బంది, ఆశా కార్యకర్తలు, పాల్గొన్నారు.

ట్రైబల్ వెల్ఫేర్ పోస్టుల భర్తీ నిలిపివేయాలి

సీతంపేట: 2025 మెగా డీఎస్సీ నుంచి ట్రైబల్ వెల్ఫేర్ పోస్టులను రిక్రూట్మెంట్ భర్తీ చేయకుండా ఆపివేయాలని శ్రీకాకుళం ఉమ్మడి జిల్లా ఏజెన్సీ గిరిజన నిరుద్యోగ సేవా సంఘం డిమాండ్ చేసింది. ఈ మేరకు సీతంపేట కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఎస్‌టియు జిల్లా అధ్యక్షులు పి.పురుషోత్తం ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ట్రైబల్ వెల్ఫేర్ పోస్టులు 2025 మెగా డీఎస్సీలో నాన్ ట్రైబల్స్‌తో భర్తీ చేయరాదన్నారు. ఐదో షెడ్యూల్, పీసా, బిసి గవర్నర్ అనుమతులు లేకుండా షెడ్యూల్ ఏరియా ట్రైబల్ వెల్ఫేర్ పోస్టు మెగా డీఎస్సీలో కలపడానికి వీల్లేదన్నారు. దీనిపై గిరిజన నిరుద్యోగ యువత ఎలాంటి పోరాటానికైనా సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బిడ్డిక ఉమామహేశ్వరరావు, మినక ఉమామహేశ్వరరావు, సవర చిరంజీవులు, నిమ్మక కోటి, కిషోర్, బిడ్డిక రామ్మోహన్, తదితరులు పాల్గొన్నారు.

రేషన్ కార్డులు, పింఛన్లు మంజూరు చేయండి

పాచిపెంట: అర్హులైన తమకు రేషన్ కార్డులు, పింఛన్లు మంజూరు చేయాలంటూ సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద నిర్వహించిన గ్రీవెన్స్‌సెల్‌లో వసనపపాడుకు చెందిన అర్హులైన గిరిజనులు సాలూరు స్ఫూర్తి మహిళా మండల అధ్యక్షురాలు బలగ రాధ ఆధ్వర్యంలో సోమవారం వినతి పత్రం అందజేశారు. మండలంలోని వసనపపాడు గిరిజన గ్రామానికి చెందిన 13 మందికి రేషన్ కార్డులు, 9 మందికి పింఛన్లు మంజూరు చేయాలని కోరారు. దీనికి ఎంపిడిఒ బివిజె పాత్రో స్పందిస్తూ స్వయంగా గ్రామాన్ని వచ్చి పరిశీలించి అర్హులైన వారికి రేషన్ కార్డులు, పింఛన్లు మంజూరుకు చర్యలు చేపడతామని చెప్పడంతో గిరిజనులు సంతృప్తి వ్యక్తం చేశారు.

వైఎస్‌ఆర్ వర్ధంతిని విజయవంతం చేయండి

సాలూరు: కీర్తిశేషులు వైఎస్ రాజశేఖర్‌రెడ్డి వర్ధంతిని మంగళవారం విజయవంతం చేయాలని మాజీ డిప్యూటీ సీఎం రాజన్నదొర కోరారు. ఉమ్మడి రాష్ట్ర చరిత్రలో వైఎస్సార్ చెరగని ముద్ర వేశారని చెప్పారు. పట్టణంలోని బోసు బొమ్మ జంక్షన్ వద్ద గల వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళ్లు అర్పించనున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి నియోజకవర్గం నలుమూలల నుంచి వైసిపి నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు హాజరు కావాలని రాజన్నదొర ఒక ప్రకటనలో కోరారు.

ఎస్‌టి కమిషన్ సభ్యులుగా మల్లేశ్వరరావు

గుమ్మలక్ష్మీపురం: కురుపాం నియోజకవర్గ జనసేన సమన్వయకర్త కడ్రక మల్లేశ్వరరావుకు ఎస్‌టి కమిషన్ సభ్యునిగా రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. మల్లేశ్వరరావు ప్రస్తుతం గుమ్మలక్ష్మీపురం మండలం ఇరిడి ఎంపిటిసిగా కొనసాగుతున్నారు. గిరిజనుల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించడంలో ఎంతగానో కృషి చేశారు. మల్లేశ్వరరావును ఎస్‌టి కమిషన్ మెంబర్‌గా నియమించడం పట్ల పలువురు అభినందించారు.

డిఆర్ డిపోలో తనిఖీ

సీతంపేట: సీతంపేటలో గిరిజన సహకార సంస్థ ద్వారా నిర్వహిస్తున్న జిసిసి డిఆర్ డిపోను సోమవారం తహశీల్దార్ డి. శ్రీకృష్ణ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా నిత్యావసర సరుకులు, రేషన్ లబ్ధిదారులకు సకాలంలో అందించాలన్నారు. రికార్డులను పరిశీలించి ఉన్న స్టాక్ రికార్డుల వ్యత్యాసాలను చూశారు. తంబు వేసే స్మార్ట్ మిషన్లు సక్రమ పనిచేయడం లేదని తహశీల్దార్ దృష్టికి ఎస్ఎం దుద్దిరాహు తీసుకువచ్చారు. మరో వారం రోజుల్లో వస్తాయని తహశీల్దార్ చెప్పారు. ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. ప్రస్తుతం బియ్యం, పంచదార, నిత్యవసర సరుకులు ప్రజలకు అందిస్తున్నామని తెలిపారు.

గిరిజన రైతులకు పశుసంపదపై శిక్షణ

కురుపాం: మండలంలో జి.శివడ పంచాయతీలో గల కొండగూడ గ్రామంలో గిరిజన రైతులకు సోమవారం కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త ఎం.అనంతకుమార్ పశుసంపదపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంటలతో పాటు పశుసంపద్ధక సంబంధించిన కోళ్లు, తేనెటీగలు, మేకలు, గొర్రెలు పెంపకం వంటి అనుబంధ వ్యవసాయాలను సమన్వయం చేసుకోవడం ద్వారా రైతులు స్థిరమైన ఆదాయం పొంది ఆర్థికంగా అభివృద్ధి చెందవచ్చన్నారు. ప్రతి ఒక్క రైతు పశు సంపదను ఎక్కువగా పెంచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గిరిజన రైతులు పాల్గొన్నారు.

యువతకు మార్గదర్శి చంద్రబాబు

సీతంపేట: ప్రజల వద్దకే పాలనను తీసుకెళ్ళిన ఆద్యుడు, యువతకు మార్గదర్శి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అని టిడిపి నియోజకవర్గ ఇన్‌చార్జి పడాల భూదేవి అన్నారు. పార్టీ కార్యాలయంలో సోమవారం ఆమె మాట్లాడుతూ తొలిసారి ముఖ్యమంత్రిగా పదవీ బాధ్యతలు చేపట్టి నేటికి 30 ఏళ్ల పూర్తయిన సందర్భంగా, ప్రజా సంక్షేమ శ్వాసగా, రాష్ట్ర ప్రగతినే లక్ష్యంగా పెట్టుకున్న విజనరీ నేత చంద్రబాబుకు అభినందనలు తెలిపారు. ఆ 3 దశాబ్దాల కాలంలో 4 సార్లు సిఎంగా చంద్రబాబు తెచ్చిన 30 అతి కీలకమైన పథకాలు, కార్యక్రమాలు, సంస్కరణలు ప్రజలకు గుర్తుండిపోయాయన్నారు. ఈ సమావేశంలో టిడిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలపై పోటెత్తిన వినతులు

ప్రజాశక్తి - పార్వతీపురం

కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్‌కు వినతులు పోటెత్తాయి. గుమ్మలక్ష్మీపురం మండలంలోని రాయగడ జమ్ము పంచాయతీ పెంగవకు చెందిన రేషన్ డీలర్ షిప్ కేటాయింపులో ఎమ్మెల్యే జగదీశ్వరి జోక్యం చేసుకుని, నిబంధనలకు విరుద్ధంగా టిడిపికి చెందిన సోనియా మహిళా సంఘానికి రేషన్ డీలర్ షిప్ కేటాయింపు చేయాలని అధికారులపై ఒత్తిడి చేస్తున్నట్లు గ్రామానికి చెందిన కొంతమంది మహిళా సంఘాల సభ్యులు సోమవారం జిల్లా కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. 15 రోజుల క్రితం కూడా వారు కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడంతో మరోసారి ఫిర్యాదు చేయడానికి వచ్చారు. గ్రామంలో ఆరు మహిళా సంఘాలు వున్నాయి. ఒక్కో సంఘం రొటేషన్ పద్ధతిలో డీలర్ షిప్ నిర్వహించాలని ఐటిడిఎ అధికారులు గతంలో నిర్ణయించారు. ఒక్కో సంఘం రెండేళ్ల పాటు డీలర్ షిప్ నిర్వహించేందుకు చర్యలు తీసుకున్నారు. ప్రస్తుతం సరస్వతి మహిళా సంఘం డీలర్ షిప్ నిర్వహిస్తోంది. ఆ తర్వాత రొటేషన్ పద్ధతిలో సీతాదేవి మహిళా సంఘానికి రేషన్ డీలర్ షిప్ కేటాయింపు జరగాలి. కానీ సోనియా మహిళా సంఘానికి రేషన్ డీలర్ షిప్ కేటాయింపు చేయాలని ఎమ్మెల్యే ఒత్తిడి చేస్తున్నారని మహిళలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికే సోనియా మహిళా సంఘం డీలర్ షిప్ నిర్వహించింది. మళ్ళీ అదే సంఘానికి రేషన్ డీలర్ షిప్ కేటాయింపు చేయాలని ఎమ్మెల్యే ఒత్తిడి చేయడంపై మహిళలు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. నిబంధనల ప్రకారం రొటేషన్ పద్ధతి లో డీలర్ షిప్ కేటాయింపు చేయాలని డిమాండ్ చేశారు.

పెంగవలో డీలర్‌షిప్ కేటాయింపుపై మహిళా సంఘం ఫిర్యాదు

ఆదుకోవాలని కలెక్టర్‌ను కలిసేందుకు వచ్చిన గిరిజన మహిళ

మాస్టర్ ప్లాన్ రోడ్డు ప్రతిపాదన రద్దు చేయాలి

పార్వతీపురం టౌన్: నివాస ప్రాంత ప్రజల అభిప్రాయాలు సేకరించని మాస్టర్ ప్లాన్ రోడ్డు ప్రతిపాదనలు రద్దుచేయాలని మద్దాలవారివీధిని (బొగ్గులవీధి) మాస్టర్ ప్లాన్ రోడ్డు నుంచి మినహాయింపు ఇవ్వాలని సోమవారం పట్టణ పౌర సంక్షేమ సంఘం కార్యదర్శి పాకల సన్యాసిరావు, జిల్లా కలెక్టర్ కార్యాలయ గ్రీవెన్సులో జిల్లా కలెక్టరు ఎ.శ్యామ్ ప్రసాద్‌కి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్వతీపురం మున్సిపాలిటీ ప్రస్తుత 25వ వార్డు, 13వ సచివాలయం మద్దాలవారివీధి మాస్టర్ ప్లాన్ రోడ్డు నుంచి 2041 ప్రతిపాదనలు విరమించుకోవాలన్నారు. ప్రజల అభిప్రాయాలు సేకరించకుండా తయారు చేసిన మాస్టర్ ప్లాన్ రోడ్డు రద్దు చేయాలని, ఈ వీధి తూర్పు, పడమరలకు సుమారు 400 మీటర్ల వైశాల్యం అని, ఉత్తర, దక్షిణాలకి అక్కడకు సుమారుగా 20 అడుగుల రోడ్లు ఉన్నాయని ఈ వీధిలో అందరూ కూడా కులవృత్తులు, చేతివృత్తులు, చిరు వ్యాపారులు, రోజువారి కూలి పనులు, చేసుకుంటూ కుటుంబ పోషణ చేసుకుంటూ జీవిస్తున్నారని ఆ ప్రతిపాదన అమలు అయితే వీధిలో సగానికి పైగా ఇల్లులు ఉండవని, కమర్షియల్ జోన్‌గా మారి ట్యాక్సులు పెరిగితాయని అన్నారు. పెరిగిన టాక్స్‌లపై ప్రతి సంవత్సరం మార్కెట్ వేల్యూపై 15శాతం మరల టాక్సులు పెరుగుతాయని ఇబ్బందులన్ని ఉన్నాయని ప్రతిపాదనను విరమించుకొని రద్దు చేయాలని కోరారు.

అనాథ పిల్లలను ఆదుకోరూ..

పార్వతీపురం: తల్లిదండ్రులను కోల్పోయిన అనాథ పిల్లలను ఆదుకోవాలని ఓ గిరిజన వృద్ధురాలు జిల్లా కలెక్టర్ శ్యాంప్రసాద్‌కి గ్రీవెన్స్ సెల్‌లో వినతిపత్రం అందజేశారు. మక్కువ మండలం కోదుపెద్దవలస గ్రామానికి చెందిన మండంగి లచ్చుమమ్మ సోమవారం తన మనమడు, మనవరాలితో కలిసి వినతిపత్రం అందజేశారు. తన కుమారుడు శంబర ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఉద్యోగం చేసేవాడని, కొద్ది నెలల క్రితం అనారోగ్యంతో మరణించాడని చెప్పారు. కొడుకు మరణించిన కొద్ది నెలలకే కోడలు కూడా అనారోగ్యంతో మృతి చెందిందని తెలిపారు. వారికి ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారని, వారి బాగోగులు చూసుకోవడం తనకు కష్టంగా మారిందని చెప్పారు. వారికి రేషన్ కార్డు లేకపోవడంతో తల్లికి వందనం డబ్బులు మంజూరు కాలేదని చెప్పారు. ఏవిధమైన ఆధారం లేని కారణంగా తాను కూలి పనులు చేస్తూ పెంచుతున్నానని, వారి పోషణ కోసం ఏదైనా సాయం చేయాలని కలెక్టర్ శ్యాం ప్రసాద్ ని కోరింది.

రెగ్యులర్ డిఇఒ, డిడిలను నియమించాలి

పార్వతీపురం: ఐటిడిఎలో రెగ్యులర్ డిడి, మన్యం జిల్లాకు రెగ్యులర్ డిఇఒను నియమించాలని గిరిజన సంక్షేమ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం జిల్లా కలెక్టర్ గ్రీవెన్స్‌లో ఐటిడిఎ పిఒ వైశాలికు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రెగ్యులర్ డిడి, డిఇఒ లేకపోవడంతో గిరిజన విద్య, పాఠశాల విద్య నిర్లక్ష్యానికి గురవుతున్నాయన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్నం భోజనానికి బిల్లులు తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. కమ్యూనిటీ హెల్త్ వర్కర్స్‌కు ఆశాతో సమానంగా జీతాలు ఇవ్వాలని, పెండింగ్ జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమం సంఘం నాయకులు పాలక రంజిత్ కుమార్, తాడంగి సాయిబాబు, ఉర్లక నాగార్జున, కొండగొర్రి చిన్నారావు, బిడ్డిక ముత్యాలు తదితరులు పాల్గొన్నారు.

అధిక ధరలు వసూళ్ల పై చర్యలు తీసుకోవాలి

కొమరాడ: పూడేసు పంచాయతీ పరిధిలోని ఎరువుల పంపిణీలో అధిక ధరలు వసూళ్లపై ప్రభుత్వ అధికారులు చర్యలు తీసుకోవాలని పుడేసు గ్రామ ప్రజలు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం జిల్లా కలెక్టర్ గ్రీవెన్స్‌లు గ్రామస్తులు సర్పంచ్ సమక్షంలో ఎరువుల అమ్మకాలు అధిక ధరలు వసూళ్లపై ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ పంచాయతీలో ఆగస్టు చివరి తేదీల్లో 160 బస్తాలు యూరియా వచ్చినప్పటికీ పూర్తి స్థాయిలో రైతులందరికీ ఇవ్వలేదన్నారు. రైతు సేవా కేంద్రంలో ఉన్న రైతులకు కాకుండా ఇతర రైతులకు ఇచ్చారని చెప్పారు. ఒక్కో యూరియో బస్తా రూ.250 ప్రభుత్వం నిర్దేశించిన ధరకు రైతులకు ఇవ్వాల్సి ఉన్నప్పటికీ అక్కడ పనిచేస్తున్న గ్రామ వ్యవసాయ సహాయకులు రూ 300లకు అమ్మారని కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. దీంతో గిరిజన రైతులు ఆర్థికంగా ఇబ్బందులు పడ్డారన్నారు. అధిక ధరలు వసూళు చేసిన వారిపై చర్యలు తీసుకుని రైతులకు ఎరువులను సకాలంలో అందించాలని కోరారు.

ఐటిడిఎ పిజిఆర్ఎస్‌కు 55 వినతులు

సీతంపేట: సీతంపేట ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి పవార్ స్వప్నిల్ జగన్నాథ్ ఆధ్వర్యంలో ఐటిడిఎలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గిరిజన ప్రజలు తమ సమస్యలపై 55 మంది వినతి పత్రాలను సమర్పించారు. ఓంద్రుజోల జిపిఎస్ పాఠశాల చుట్టూ రక్షణ గోడ నిర్మించాలని సురేష్ వినతి పత్రం సమర్పించారు. జరడుగూడ గ్రామానికి చెందిన ఆరిక చిన్నారావు తాగునీటి బోర్ మంజూరు చేయాలని, పాలిష్ కోట గ్రామానికి చెందిన బిడ్డిక బెన్నయ్య తమ ఇద్దరి పిల్లలకు తల్లికి వందనం నగదు జమ కాలేదని, జన్నిగూడ గ్రామానికి చెందిన సవర బెనర్జీరావు తమ గ్రామ పాఠశాలకు భాషా వాలంటీర్‌ను నియమించాలని వినతిపత్రం అందించారు. సీతంపేట గ్రామానికి చెందిన కొండగొర్రె సుందర్రావు తహశీల్దారు తమపై పెట్టిన తప్పుడు కేసులను కొట్టివేసి తమకు న్యాయం చేయాలని, పోలవరం గ్రామానికి చెందిన ఊయక బోడమ్మ ఆయిల్ ఇంజన్ మంజూరు చేయాలని, వజ్జాయిగూడ గ్రామానికి చెందిన సవర జమ్ముడు కొండచీపురు, పసుపు, జీడి, చింతపండు మొదలగు ఉత్పత్తులను వ్యాపారం చేసుకోవడానికి అనుమతి మంజూరు చేయాలని కోరారు. గొట్ట మంగళాపురం గ్రామానికి చెందిన చంద్రశేఖరరావు నాగవళి నది వంతెన వద్ద ఇసుక తవ్వకాలను ఆపివేయాలని, జగతిపల్లి గ్రామానికి చెందిన సవర మౌనిక ఆర్‌బికెల ద్వారా యూరియా సరఫరా చేయాలని, కోడూరు గ్రామానికి చెందిన నీలవేణి సిహెచ్‌డబ్ల్యు ఉద్యోగం ఇప్పించాలని వినతి పత్రం అందించారు. ఈ కార్యక్రమంలో ఎపిఒ జి.చిన్నబాబు, డిడి అన్నదొర, డిప్యూటీ డిఇఒ రామ్మోహన్‌రావు, ఉపాధి హామీ ఎపిడి శ్రీహరిరావు, వెలుగు ఎపిడి సన్యాసిరావు, డిప్యూటీ డిఎంహెచ్ఒ విజయ పార్వతి, డిఇ నాగభూషణం డిఎంఒ పివి సత్యనారాయణ, పిహెచ్ఒ గణేష్, ఎఎంఒ కోటిబాబు, ఇతర అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గ్రీవెన్స్‌కు గైర్హాజరైతే మెమోలు

గ్రీవెన్స్ కార్యక్రమంలో భాగంగా ఐటిడిఎ పిఒ పవార్ స్వప్నిల్ జగన్నాథ్ మాట్లాడుతూ గ్రీవెన్స్ కార్యక్రమానికి అధికారులు అందరూ సమయానికి హాజరు కావాలన్నారు. గ్రీవెన్స్‌లో వచ్చిన వినతులను సత్వరమే పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలన్నారు. ఇక నుంచి గ్రీవెన్స్‌కి హాజరు కాని వారికి మెమోలు జారీ చేస్తామని హెచ్చరించారు. అధికారులందరూ బాధ్యతగా పనిచేయాలని సూచించారు.

స్వమిత్వ గ్రామాలను సందర్శించాలి

ప్రజాశక్తి - పార్వతీపురం

జిల్లాలో స్వమిత్వ పనులు జరుగుతున్న గ్రామాలను మండల అధికారులు మంగళవారం సందర్శించాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ అధికారులను ఆదేశించారు. స్వయంగా ఆయా పనులను తనిఖీ చేసి నివేదిక అందించాలని కోరారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో పలు అంశాలపై కలెక్టర్ సోమవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువుకొని నిరుద్యోగులుగా మిగిలిన యువతకు వారికి నచ్చిన రంగాల్లో నైపుణ్యం, శిక్షణ కార్యక్రమాలను చేపట్టి ఉపాధి అవకాశాలు కల్పించేలా కౌసలం పేరుతో డేటాను పొందడం జరిగిందని అన్నారు. ఆ డేటా ఆధారంగా ఎంపిడిఒ, ఇఒపిఆర్‌డిలు తనిఖీ చేసి, కచ్చితమైన డేటాను స్పష్టం చేయాలన్నారు. మీరిచ్చిన డేటా ఆధారంగా ప్రణాళిక ఉంటుందని, కావున ఎటువంటి పొరపాట్లకు తావివ్వరాదని పేర్కొన్నారు. ఇపిటిఎస్ కింద ప్రతి ప్రభుత్వ కార్యాలయంలోని జిఒలు, సర్క్యులర్లు, ఇతర ఉత్తర్వులు తదితర వాటిని స్కానింగ్ చేసి అప్‌లోడ్ చేయాలని చెప్పారు. ఇప్పటివరకు జిల్లావ్యాప్తంగా 5 వేలు పూర్తి చేశారని, కనీసం 20 వేల ప్రతులు ఆన్‌లైన్ నమోదు చేయాలన్నారు. మండలాల్లోని రైతులకు సరిపడా ఎరువులను సరఫరా చేస్తున్నామని, వాటిని మండల అధికారుల పర్యవేక్షణలో పంపిణీ అయ్యేలా చూడాలని అన్నారు. ఎక్కడా ఎరువుల కొరత ఉండరాదని, కృత్రిమ కొరత సృష్టిస్తే చర్యలు తప్పవని అన్నారు. వచ్చిన స్టాకుతో పాటు పంపిణీ వివరాలను రైతులకు తెలిసేలా డిస్ప్లే చేయాలని పేర్కొన్నారు. పిజిఆర్‌ఎస్‌లో వచ్చిన దరఖాస్తులపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించి, సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అన్నారు. సమావేశంలో డిఆర్ఒ కె.హేమలత, ఎస్డీసీలు పి.ధర్మచంద్రారెడ్డి, ఎస్.దిలీప్ చక్రవర్తి, డిపిఒ టి.కొండలరావు, డిఎంహెచ్ఒ డాక్టర్ ఎస్.భాస్కరరావు, ఐసిడిఎస్, డ్వామా, డిఆర్‌డిఎ పీడీలు టి.కనకదుర్గ, కె.రామచంద్రరావు, ఎం.సుధారాణి, డిఇఒ బి.రాజకుమార్, జిల్లా పశు సంవర్ధక అధికారి డాక్టర్ ఎస్.మన్మథరావు, ఇతర జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రక్తహీనత నివారణకు చర్యలు

ప్రజాశక్తి - గరుగుబిల్లి

రక్తహీనతను నివారించే దిశగా చర్యలు చేపట్టాలని జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ పిఎల్ రఘుకుమార్ అన్నారు. మండలంలోని ఉల్లిభద్రలో జరుగుతున్న 104 వైద్య శిబిరాన్ని సోమవారం ఆయన తనిఖీ చేశారు. అక్కడ వైద్య సేవలు వినియోగించుకుంటున్న వారి వివరాలు రికార్డులో పరిశీలించి వారి ఆరోగ్య సమస్యలు, అందజేసిన చికిత్సను అడిగి తెలుసుకున్నారు. రోగుల తెలిపే ఆరోగ్య సమస్యలను రికార్డులో స్పష్టంగా నమోదు చేయాలని సిబ్బందిని ఆదేశించారు. కొత్తగా గుర్తించిన దీర్ఘకాలిక రోగులను పర్యవేక్షించాలన్నారు. ఎక్కువగా రక్తహీనతపై దృష్టి సారించాలని గర్భిణులకు, బాలింతలు, చిన్నారులు, కిశోర బాలికల్లో హిమోగ్లోబిన్ శాతం తక్కువగా గుర్తించిన వారికి నిర్దేశించిన చికిత్స అందజేస్తూ రక్తశాతం వృద్ధి చెందే వరకు పర్యవేక్షించాలని డాక్టర్ రఘుకుమార్ స్పష్టం చేశారు. అవసరమైన వారికి సికిల్ సెల్ ఎనీమియా నిర్ధారణ పరీక్షలు జరపాలన్నారు. హిమోగ్లోబిన్ శాతం తరచుగా తక్కువగా ఉంటున్న వారిపై దృష్టి పెటాలని, సికిల్ సెల్ టెస్ట్‌ను ఆయన స్వయంగా పరిశీలించారు. 104 వాహనంలో మందులు, వైద్య పరికరాలు తనిఖీ చేసి వారు అందిస్తున్న సేవలపై సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎఎన్‌ఎం సుబ్బలక్ష్మి, 104 సిబ్బంది దుర్గాప్రసాద్, శంకరరావు, ఆశా కార్యకర్తలు ఉన్నారు.

నడుకూరులో అన్నదానం

వీరఘట్టం: మండలంలోని నడుకూరు బీసీ కాలనీలో సోమవారం మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా సుమారు 4వేల మందికి అన్నదాన కార్యక్రమం నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులతో పాటు గ్రామస్తులు పాల్గొన్నారు.

ఉత్తమ పౌర సమాజ నిర్మాణమే లక్ష్యం

పార్వతీపురం : ఉత్తమ పౌర సమాజ నిర్మాణమే లక్ష్యంగా జన విజ్ఞాన వేదిక లక్ష్యంగా పనిచేసి, జన చైతన్యానికి పాటుపడదామని జన విజ్ఞాన వేదిక ప్రతినిధులు తీర్మానించారు. సోమవారం జన విజ్ఞాన వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షులు పాలక రంజిత్ కుమార్, జిల్లా అధ్యక్షులు వంగల దాలినాయుడు,ప్రధాన కార్యదర్శి డి.చంద్రమౌళి, ట్రెజరర్ కొండగొర్రి చిన్నారావు, ప్రతినిధులు యు.నాగార్జున, పి.సురేష్, బి.ముత్యాలు, ఎం.వెంకటరమణ తదితర ప్రతినిధులు జెవివి జిల్లా స్థాయి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇటీవల గుంటూరులో జరిగిన రాష్ట్రస్థాయి సమావేశానికి సంబంధించిన వివరాలను వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షులు రంజిత్ కుమార్ సమావేశానికి వివరించారు. ఈ సందర్భంగా వేదిక దిశానిర్దేశానికి సంబంధించి రాష్ట్ర కమిటీ ఆదేశాలపై చర్చించారు. అనంతరం జిల్లాస్థాయిలో పలు కార్యక్రమాలు చేపట్టాలని తీర్మానాలు చేశారు. ఈ సందర్భంగా జెవివి జాతీయ ప్రధాన కార్యదర్శి ఎంవిఆర్ కృష్ణాజీ సభను ఉద్దేశించి వీడియో కాల్ ద్వారా పలు సూచనలు సలహాలు చేశారు. కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక ప్రతినిధులు పాల్గొన్నారు.

విఆర్ఎలకు పేస్కేల్ అమలు చేయాలి

ప్రజాశక్తి - సాలూరు

గ్రామ రెవెన్యూ సహాయకులకు పేస్కేల్ అమలు చేయాలని గ్రామ సేవకుల సంఘం జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. రెవెన్యూ శాఖ పరిధిలో పనిచేస్తున్న గ్రామ రెవెన్యూ సహాయకులకు పేస్కేల్ అమలు చేసి, న్యాయం చేయాలని గ్రామ సేవకుల సంఘం జిల్లా కార్యదర్శి జి.కృష్ణారావు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. సాలూరులో సోమవారం జరిగిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. అర్హత గల విఆర్ఎలను విఆర్ఒలుగా ఉద్యోగోన్నతి అవకాశం కల్పించాలని, నామినీలకు విఆర్ ఎలుగా మార్చేందుకు ప్రభుత్వం ఆదేశాలు ఇవ్వాలని, అటెండర్, నైట్ వాచ్మెన్ ప్రమోషన్ కోట 20 శాతాన్ని 70 శాతానికి పెంచాలని, అక్రమ డ్యూటీలను వెంటనే రద్దు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. రానున్న శాసనసభ సమావేశాల్లో విఆర్ఎ సమస్యలపై చర్చించి, పరిష్కారానికి ప్రభుత్వం కృషి చేయాలని, లేకుంటే సంఘం ఆధ్వర్యంలో భవిష్యత్తు పోరాటాలకు సిద్ధపడతామని తెలిపారు. సమావేశం తర్వాత తహశీల్దార్‌కు వినతిని అందజేశారు. కార్యక్రమంలో నాయకులు పాపారావు, రాజమాణిక్యం, మోహన్ సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్‌వై నాయుడు పాల్గొన్నారు.

సాలూరు : ధర్నా చేస్తున్న విఆర్ఎలు

నూతన కమిటీ ఎన్నిక

సాలూరు మండల విఆర్ఎల సంఘం అధ్యక్ష కార్యదర్శులుగా వెలగాడ కృష్ణ, చింతగడ నరేష్, గౌరవ అధ్యక్షులుగా సామలపల్లి మోహన్, కోశాధికారిగా గంటా రాజ మాణిక్యం, కమిటీ సభ్యులుగా పాపారావు, ప్రసన్న, తిరుపతి, సుబ్బయ్య, జగన్, అప్పారావు, దమయంతి ఎన్నికయ్యారు.

పాచిపెంట : రాష్ట్రంలో రెవెన్యూ శాఖ పరిధిలో పనిచేస్తున్న గ్రామ రెవెన్యూ సహాయకులకు పేస్కేల్ అమలు చేసి, న్యాయం చేయాలని గ్రామ సేవకుల సంఘం జిల్లా కార్యదర్శి జి. కృష్ణారావు ప్రభుత్వాన్ని కోరారు. మండల కేంద్రంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అర్హత ఉన్న విఆర్ఎలను విఆర్ఒలుగా ఉద్యోగన్నతి అవకాశం కల్పించాలని, నామినీలకు విఆర్ ఎలుగా మార్చేందుకు ప్రభుత్వం ఆదేశాలు ఇవ్వాలని, అటెండర్, నైట్ వాచ్‌మెన్ ప్రమోషన్ కోట 20 శాతం నుంచి 70 శాతానికి పెంచాలని, అక్రమ డ్యూటీలను వెంటనే రద్దు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. వచ్చే శాసనసభ సమావేశాల్లో విఆర్ఎ సమస్యలపై చర్చించి, పరిష్కారానికి ప్రభుత్వం కృషి చేయాలన్నారు. లేకుంటే సంఘం ఆధ్వర్యంలో భవిష్యత్తు పోరాటాలకు సిద్ధపడతామని తెలిపారు. సమావేశం తర్వాత సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని డిప్యూటీ తహశీల్దార్‌కి అందించగా, ప్రభుత్వం దృష్టికి విఆర్ఎల సమస్యలు తీసుకువెళ్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండలం విఆర్ఎ సంఘం కన్వీనర్ పి.అశోక్, సభ్యులు ఆనందరావు, తవిటమ్మ, అప్పలరాజు, సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్ వై నాయుడు, మండల నాయకులు కోరాడ ఈశ్వరరావు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

బావిలో దూకి వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి - కొమరాడ

గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ మానసికంగా కుంగిపోయిన వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలో చోటు చేసుకున్నట్లు ఎస్ఐ నీలకంఠం తెలిపారు. విక్రంపురం గ్రామానికి చెందిన తూతిక సోమేశ్వరరావు (60) కిడ్నీ సమస్య కారణంగా ఏడాదిన్నరగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. జిల్లా ఆసుపత్రిలో ప్రతి వారం డయాలసిస్ చేపించుకుంటున్నారు. ఆదివారం తనకి నడుం నొప్పి ఎక్కువ రావడం, మందులు వాడినా ఫలితం లేకపోవడంతో మానసికంగా బాధపడుతూ జీవితం మీద విరక్తి చెంది ఆదివారం రాత్రి ఇంటి నుండి బయటకు వచ్చి ఊరి చివరన ఉన్న దివాన్ నూతిలో పడి ఆత్మహత్య చేసుకున్నట్లు తన భార్య పార్వతి ఫిర్యాదు చేశారు. సదరు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని మృతునికి భార్య, ఒక బాబు, పాప ఉన్నారని ఎస్ఐ తెలిపారు.

24 కేజీల గంజాయి స్వాధీనం

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

పట్టణంలో సోమవారం సాయంత్రం 24 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకుని, ఏడుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని, ఒక కారు బైకు సీజ్ చేసినట్లు పట్టణ సిఐ మురళీధర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒడిస్సా నుండి రామ్ ఖిహిల, రమేశ్ కోరా, సంతోష్, ప్రశాంత్, అనే నలుగురు వ్యక్తులు కారులో సుమారు 24 కేజీల గంజాయి ప్యాకెట్లను తీసుకువచ్చి, ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఆకాష్, వినయ్, ప్రతాప్, అనే వ్యక్తులకు ఫ్లైఓవర్ దగ్గరలో ఉన్న లక్ష్మి రిసిడెన్సి లాడ్జి వద్ద ఇస్తుండగా, ముందస్తు సమాచారం మేరకు ఆ ప్రాంతం వద్దకు పట్టణ ఎస్ఐ గోవింద, పోలీస్ సిబ్బంది వారిని అదుపులో తీసుకున్నారు. గంజాయిని స్వాధీనం చేసుకుని, కారును బైకును సీజ్ చేశారు. వీరిని రిమాండ్‌కు తరలిస్తున్నట్లు సిఐ తెలిపారు. గంజాయి, నాటు సారాపై ప్రత్యేక నిఘా పెట్టామని ఎవరైనా రవాణా చేసినా, అమ్మకాలు సాగించినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

స్టడీ మెటీరియల్‌ను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి - కురుపాం

స్టడీ మెటీరియల్‌ను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఎంఇఒ ఎన్.సత్యనారాయణ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని కురుపాం-2, శివన్నపేట పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు యస్ సొసైటీ కార్యదర్శి షేక్ గౌస్ అందజేసిన మెటీరియల్‌కు ఆయన చేతులు మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువు కోసం స్వచ్ఛంద సంస్థలు ఇటువంటి సేవా కార్యక్రమాలు చేయడం అభినందనీయమన్నారు. ప్రతి విద్యార్థీ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని సక్రమంగా చదివి ఉన్నత స్థానంలో స్థిరపడాలని సూచించారు. యస్ సొసైటీ కార్యదర్శి షేక్ గౌస్ మాట్లాడుతూ ఏటా దాతల సహకారంతో విద్యార్థులకు నోట్ బుక్స్ అందించే ప్రయత్నం చేస్తున్నామన్నారు. ప్రాథమిక పాఠశాలల్లో నోట్‌బుక్స్ కొరత ఉందని గుర్తించామని ఈ ఏడాది కురుపాం, గుమ్మలక్ష్మీపురం మండలంలో 1000 మంది విద్యార్థులకు నోట్ బుక్స్ అందిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు భాస్కరరావు, గౌరీ శంకర్, సిబ్బంది పాల్గొన్నారు.

ఇళ్ల బిల్లులు మంజూరు చేయాలి

ప్రజాశక్తి - పార్వతీపురం

సీతంపేట మండలం మర్రిపాడు పంచాయతీలో తొమ్మిది గ్రామాల గిరిజనులు పిఎం జన్మన్ కింద కట్టుకున్న ఇళ్లకు వెంటనే బిల్లులు మంజూరు చేయాలని కలెక్టరేట్ వద్ద సోమవారం ధర్నా నిర్వహించి, వినతిని అందజేశారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి గంగనాయుడు మాట్లాడుతూ మర్రిపాడు పంచాయతీలోని 56 మంది గిరిజనులకు ఇళ్లు మంజూరు చేశారని, ఇంటి పునాదులు వేసి నాలుగు నెలలు అవుతున్నా ఇంతవరకు గృహ నిర్మాణ శాఖ అధికారులు బిల్లులు మంజూరు చేయలేదని అన్నారు. బిల్లులు ఇవ్వకపోవడంతో గిరిజనులు మిగిలిన ఇంటి పనులు చేసుకోలేకపోతున్నారన్నారు. ప్రభుత్వం ఇస్తున్న పక్కా ఇళ్లు నిర్మించుకోవాలని ప్రతిరోజు పాలకులు, అధికారులు ప్రచారం చేస్తున్నారని, కానీ నిర్మించుకున్న వారికి మాత్రం సక్రమంగా బిల్లులు మంజూరు చేయడం లేదని వెంటనే మర్రిపాడు పంచాయతీలో గల గిరిజనులతో పాటు జిల్లాలో పిఎం జన్మన్ కింద ఇళ్లు నిర్మించుకుంటున్న గిరిజనులందరికీ బిల్లులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఇళ్లు లేని వారికి పీఎం జన్మన్ కింద వెంటనే రాజకీయాలతో సంబంధం లేకుండా ఇళ్లు మంజూరు చేసి బిల్లులు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మర్రిపాడు సర్పంచ్ గారు గిరిజనులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న సిపిఎం నాయకులు, గిరిజనులు

సీనియర్ ఉపాధ్యాయులకు అన్యాయం

వీరఘట్టం: ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు ఎంపికల్లో ప్రజా ప్రతినిధులు సిఫారసు చేసిన వారికే ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు ఎంపిక చేస్తున్నట్లు పలువురు ఉపాధ్యాయులు సోమవారం ఓ ప్రకటనలో ఆరోపించారు. ఈ సంవత్సరం కూడా అవార్డులు ఎంపికలో సీనియర్ ఉపాధ్యాయులకు మరోసారి తీవ్ర అన్యాయం జరిగిందని చెప్పారు. ప్రతిభ కనబరిచిన సీనియర్ ఉపాధ్యాయులకు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు ఎంపిక చేయాలని ఉపాధ్యాయులు కోరుతున్నారు.

తుంబకొండలో బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ

సీతంపేట : మండలంలోని తుంబకొండ పంచాయతీలో సోమవారం బాబు షూరిటీ మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు . ప్రభుత్వం తీరును విమర్శించారు. గిరిజన సంక్షేమం వైసిపితోనే సాధ్యమన్నారు. గ్రామాల్లో సమస్యలు ఉన్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో పాలకొండ ఎస్‌టి సెల్ నియోజకవర్గ కన్వీనర్ నిమ్మక కాంతారావు, సర్పంచ్ బి.సోమేశ్వరరావు, వెంకటేష్, తిరుపతిరావు, గిదరయ్య పాల్గొన్నారు.

వినాయకుడికి 108 రకాల ప్రసాదాలు

కురుపాం: మండల కేంద్రంలో కళింగ వైశ్య సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వినాయకుని మండపం వద్ద వినాయకుడికి సోమవారం నిర్వహించిన పూజల్లో 108 రకాల ప్రసాదాలను భక్తులు నైవేద్యంగా పెట్టి పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైశ్య సంఘం అధ్యక్షులు అంధవరపు కోటేశ్వరరావు, భక్తులు పాల్గొన్నారు.